FOCUS TELUGU TV
అనునిత్యం - ప్రజాపక్షం

@netifocusnews @focustv
www.netifocusnews.com
http://epaper.netifocusnews.com
TS-18-0006625

# నేటి ఫోకస్ న్యూస్

అను నిత్యం...ప్రజా పక్షం...

తెలుగు డిజిటల్ దినపత్రిక

ఎడిటర్: యం.తరుణ్ | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం మా ఈ నేటి ఫోకస్ న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రిక || హైదరాబాద్ || మంగళవారం 04, మే 2024 || పేజీలు: 04



# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

## ఉదయం 8 గంటలకు ప్రారంభం.. ప్రతీ 25 నిమిషాలకు రౌండ్ ఫలితం

- తొలి 5 గంటల్లోనే 111 నియోజకవర్గాల తీర్పు
- కొవ్వూరు, నరసాపురంలో 13 రౌండ్లే
- దీంతో తొలి తీర్పు ఇక్కడి నుంచే..
- 25-27 రౌండ్లు పట్టనున్న భీమిలి, పాణ్యం
- లోక్‌సభ ఫలితాల్లో ముందుగా రాజమండ్రి,
- నరసాపురం.. చివరిగా అమలాపురం!
- కౌంటింగ్ కేంద్రాల్లో అల్లర్లు చేస్తే జైలుకే
- 42 వేల మంది పోలీసులు, 67 కంపెనీల
- బలగాలతో పటిష్ఠ భద్రత: సీఈవో మీనా



**నేటి ఫోకస్ న్యూస్,హైదరాబాద్/అమరావతి:**

కౌంటింగ్ కేంద్రాల్లో ఏజెంట్లు అల్లరి సృష్టించాలని ప్రయత్నం చేస్తే బయటకు పంపుతామని, కేసు పెట్టి జైలుకు కూడా పంపు మిగతా 2లో..



# ఎమ్మెల్సీ కవిత కస్టడీ పొడిగింపు

- సీబీఐ కేసులో ఈనెల 7వరకు
- ఈడీ కేసులో జూలై 3 దాకా..

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ, జూన్ 3:**

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడిషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. సోమవారం ఆమెను ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. తొలుత ఈడీ కేసులో విచారణ జరిగింది. జూలై 3న కవితను కోర్టు ముందు హాజరు పరచాలని న్యాయమూర్తి కావేరి బవేజా స్పష్టం చేశారు. సీబీఐ కేసులో మాత్రం మధ్యాహ్నం 2 గంటలకు విచారణ చేపడతామని తెలిపారు. కాగా, కవితను కలిసేందుకు భర్త అనిల్‌తోపాటు ఇద్దరు కుమారులకు అవకాశం కల్పించాలని ఆమె న్యాయవాది నితేష్ రాణా కోరారు. ఇద్దరు కుమారులు మైనర్లేనా? అని న్యాయమూర్తి ప్రశ్నించారు. పెద్దబ్బాయి మేజర్ అని, చిన్న కుమారుడు మైనర్ అని న్యాయవాది బదులివ్వగా, కవితను కలిసేందుకు జడ్జి అంగీకరించారు. ఆ తర్వాత కవితతో భర్త, కుమారులు కొద్దిసేపు ముచ్చటించారు. సీబీఐ కేసులో మధ్యాహ్నం 2 గంటల తర్వాత కోర్టులో విచారణ జరిగింది. ఈ నెల 7 వరకు జ్యుడీషియల్ కస్టడీని పొడిగిస్తున్నట్లు జడ్జి చెప్పారు. కోర్టు హాలులోకి వచ్చే ముందు కవిత 'జై భారత్.. జై తెలంగాణ' అంటూ నినాదాలు ఇచ్చారు.



# ఓటెయ్యడంలో ప్రపంచ రికార్డు

- ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య పక్రియ
- ఈ ఎన్నికల్లో ఓటేసిన 64.2 కోట్ల మంది భారతీయులు
- ఓటేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపిన ఇసి
- 31.2 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగం
- మీడియాతో కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి రాజీవ్ కుమార్

**నేటి ఫోకస్ న్యూస్, న్యూఢిల్లీ-జూన్3:**

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య పక్రియను విజయవంతంగా నిర్వహించినట్లు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ తెలిపారు. ఈ ఎన్నికల్లో 64.2 కోట్ల మంది ఓటు వేయడంతో మనం ప్రపంచ రికార్డు సృష్టించినట్లు వెల్లడించారు. మిగతా 2లో..




# పాలిసెట్‌లో 84%ఉత్తీర్ణత

- పెనుబల్లి విద్యార్థికి ఎంపీసీ విభాగంలో మొదటి ర్యాంకు
- ఎంబైపీసీ విభాగంలో సూర్యాపేట విద్యార్థికి ఫస్ట్ ర్యాంక్

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్:** తెలంగాణ పాలిసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. మే 24ననిర్వహించిన పాలిసెట్ ఫలితాలను సోమవారం విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఇందులో 84 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ సెట్‌కు 92,808 మంది విద్యార్థులు ద రఖాస్తు చేసుకోగా.. ఇందులో 82,319 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 69,728 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 120 మార్కులకు నిర్వహించిన ఈ పరీక్షలో 36 మార్కులు (30 శాతం) సాధించిన వారిని ఉత్తీర్ణులుగా మిగతా 2లో..

# పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

13మంది మృతి.. పలువురికి తీవ్ర గాయాలు




2



# 15వ తేదీ లోగా కొత్త వీసీలు..

- మూడు రోజుల్లో సెర్చ్ కమిటీ సమావేశాలు
- 6లేదా 7నుంచి బడిబాట
- విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడి

2



# మార్కెట్లకు ఎగ్జిట్ పోల్స్ కిక్

- సరికొత్త శిఖరాలకు సూచీలు
- సెన్సెక్స్ 2,507 పాయింట్లు అప్..
- 76,469 వద్ద ముగింపు
- 733 పాయింట్ల వృద్ధితో 23,264 స్థాయికి నిఫ్టీ
- సూచీలకు మూడేళ్లలో ఇదే అతిపెద్ద లాభం
- 14 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద
- రూ.425.91 లక్షల కోట్లు దాటిన బీఎస్ఈ మార్కెట్ క్యాప్

వివరాలు 02లో..



# రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి..

- ఆయన ఎన్నడూ ఉద్యమకారుడు కాలేడు: హరీశ్‌రావు

**నేటి ఫోకస్ న్యూస్, సిద్దిపేట, జూన్ 3:**

రేవంత్ రెడ్డి ఏనాడు జై తెలంగాణ అనలేదని, ఆయన ఎంత పెద్ద పదవులు అనుభవించినా ఉద్యమకారుడు మాత్రం కాలేడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ మిగతా 2లో..

## పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

**నేటి ఫోకస్ న్యూస్, భోపాల్-జూన్3:**
మధ్యప్రదేశ్‌లోని రాజ్‌గఢ్ జిల్లాలో ఆదివారం రాత్రి ఘోర ప్రమాదం సంభవించింది. పెళ్లి బృందంతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో 13 మంది మృతి చెందగా.. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు చిన్నారులు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ఇద్దరిని భోపాల్ తరలించినట్లు అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లోని మోతీపురాకు చెందిన 30 మంది మధ్యప్రదేశ్‌లోని కులంపూర్‌లో జరిగే పెళ్లికి ట్రాక్టర్‌లో బయలుదేరగా.. రాజ్ గఢ్ జిల్లాలోని పీప్ లోడీ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడిందని పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఎంపీ సీఎం మోహన్ యాదవ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటనా స్థలంలో రాజ్ గఢ్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, మంత్రి నారాయణ్ సింగ్ సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారని సీఎం తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నానని వెల్లడించారు. అటు, రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మ కూడా ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాం÷-రతి వ్యక్తం చేశారు. అక్కడి అధికారులు, పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నామని అన్నారు.

## రేవంత్ రెడ్డి ఉద్యమ ద్రోహి..

(మొదటి పేజీ తరువాయి..)
ఎక్కుపెట్టిన ద్రోహిగా రేవంత్ చరిత్రలో మిగిలిపోతాడని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమకారులమన్న ఘనత తమకు మాత్రమే దక్కుతుందని కరెంటు కోసం, తెలంగాణ ఉద్యమం కోసం ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేశామని గుర్తు చేశారు. సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో సోమవారం దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేసీఆర్ లేకపోతే తెలంగాణ సిద్ధించేది కాదని అన్నారు. ఆనాడు సమైక్య పాలనలో జై తెలంగాణ మాటను నిషేధించారని, ఇప్పుడు రేవంత్ పాలనలో ఆ పదమే మాయమైపోయిందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం కలను నిజం చేసిన బీఆర్ఎస్‌ను ప్రజలు మర్చిపోరని హరీశ్ స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు. కాగా, సోమవారం తన పుట్టిన రోజు సందర్భంగా హరీశ్‌రావు మాజీ సీఎం కేసీఆర్‌ను కలుసుకుని ఆశీర్వాదం తీసుకున్నారు.

## పాలిసెట్‌లో 84% ఉత్తీర్ణత

(మొదటి పేజీ తరువాయి..)
ప్రకటించారు. అయితే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఒక్క మార్కు సాధించినా ఉత్తీర్ణులుగా పరిగణించారు. విద్యార్థులు సాధించిన ర్యాంకుల ఆధారంగా పాలిటెక్నికల్ కాలేజీలతోపాటు ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ యూనివర్సిటీల్లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నారు. అలాగే వెటర్నరీ యూనివర్సిటీలో డిప్లొమా కోర్సుల్లో సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. కాగా పాలిసెట్‌లో ఖమ్మంజిల్లా పెనుబల్లి మండలం మండాలపాడుకు చెందిన తూమాటి హరీష్ ఎంపీసీ విభాగంలో 120కి 120మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించాడు. హరీష్ తల్లి శశి.. అంగన్‌వాడీ టీచర్. తండ్రి వెంకటేశ్వరరావు ఓ దుకాణంలో గుమస్తా. మధ్యతరగతి కుటుంబానికి చెందిన హరీష్ పాలిసెట్‌లో ప్రథమ స్థానం సాధించటం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎంబైపీసీ విభాగంలో సూర్యాపేట బాలాజీ నగర్‌కు చెందిన గోపగాని శ్రీనిఖ 119.5 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి ముత్యాల పార్థసారథి ఎంపీసీ విభాగంలో 118మార్కులతో రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించాడు. కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కంది శివకుమార్ 114 మార్కులతో 93వ ర్యాంకు సాధించడంతోపాటు ఎంబైపీసీ విభాగంలో 110.5 మార్కులతో 119వ ర్యాంకు సాధించాడు. కేసముద్రం మండలం కల్వల గ్రామానికి చెందిన ఆరెందుల అశ్రిత ఎంపీసీ విభాగంలో 110 మార్కులు సాధించి 278వ ర్యాంకు సాధించింది. కాగా పాలిసెట్‌లో హైదరాబాద్ విద్యార్థులు సత్తాచాటారు. టాప్ 15 ర్యాంకుల్లో నాలుగింటిని కైవసం చేసుకున్నారు. ఎంపీసీ విభాగంలో 2, 10, 12 ర్యాంకులతోపాటు బైపీసీ స్ట్రీమ్‌లో 5వ ర్యాంకు హైదరాబాద్ విద్యార్థుల సొంతమైంది. మీర్‌పేట్ త్రివేణి నగర్‌కు చెందిన కటకం లలిత్ మనోహర్ ఎంపీసీ స్ట్రీమ్‌లో స్టేట్ 2వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో బీటెక్ చదవడమే తన లక్ష్యమని మనోహర్ తెలిపాడు. మల్కాజిగిరి బీజేఆర్ నగర్‌కు చెందిన ముత్తోజు విష్ణువర్ధన్ బైపీసీ స్ట్రీమ్‌లో రాష్ట్రస్థాయి 5వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవడమే తన లక్ష్యమని తెలిపాడు. అల్వాల్ వీబీఆర్ కాలనీకి చెందిన చెలిమెల రోహన్ 10వ ర్యాంకు సాధించాడు. ఐఐటీలో బీటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చేయాలనేది తన ఆకాంక్షగా తెలిపాడు. ఉప్పల్‌కు చెందిన వనం అమూల్య 12వ ర్యాంకు సాధించింది. మారేడ్‌పల్లిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్‌లో ఏఐఎంఎల్ డిప్లొమా చదవాలని తన ఆకాంక్షగా పేర్కొంది.

# కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి..)
తామని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేషకుమార్ మీనా హెచ్చరించారు. ఏజెంట్లు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని స్పష్టం చేశారు. ఏదైనా అనుమానం ఉంటే నిర్దేశిత విధానంలో ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. సరైన కారణాలు ఉంటేనే రీ కౌంటింగ్‌కు అనుమతి ఇస్తామని, మళ్లీ మళ్లీ కోరితే లెక్కలోకి తీసుకోబోమన్నారు. ప్రతి రౌండ్‌లో రీకౌంటింగ్ అడగటానికి వీల్లేదని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత... కారణం సహేతుకమైనదే అయితే ఆర్వో స్పీకింగ్ ఆర్డర్ ఇస్తారన్నారు. అభ్యర్థులు కూడా ఏదైనా అనుమానం ఉంటే నిబంధనల ప్రకారం ఫిర్యాదు చేయవచ్చునని కోరారు. కౌంటింగ్ రోజు ఫలితాల వెల్లడి తర్వాత ఊరేగింపులకు అనుమతి ఉండబోదని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియలో అటెస్టేషన్ అధికారి సంతకంపై ఆక్షేపణ తెలపడానికి వీల్లేదన్నారు. కౌంటింగ్ రోజు తర్వాత కూడా 144 సెక్షన్ కొనసాగించాలా వద్దా అనేది జిల్లాల కలెక్టర్లు పరిస్థితిని బట్టి నిర్ణయం తీసుకుంటారన్నారు. 67 కంపెనీల సాయుధ భద్రతా బలగాలను కౌంటింగ్ కేంద్రాలు, శాంతిభద్రతల కోసం వినియోగిస్తున్నామని మీనా చెప్పారు. కౌంటింగ్ కేంద్రం రెడ్ జోన్ పరిధిలో ఉంటుందని, డ్రోన్ల ద్వారా నిఘా పెడతామని తెలిపారు. "ఎన్నికల రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై ఈసీ సీరియస్‌గా ఉంది. ఆ ఘటనలపై తీవ్ర చర్యలు తీసుకున్నాం. అయితే, కౌంటింగ్ రోజు అలాంటి ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశాం. రాష్ట్రంలో 1985 సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాం. సమస్యలు సృష్టించే 12 వేల మందిని గుర్తించి బైండోవర్ చేశాం. పోలీస్ పికెట్లు పెట్టాం. క్యూఆర్టీ టీమ్‌లు రంగంలో ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా 45 వేల మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో ఉంటారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో 83 నియోజకవర్గాలను సున్నితమైన నియోజకవర్గాలుగా గుర్తించి, అక్కడ సీనియర్ పోలీస్ అధికారులను నియమించాం. జనవరి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో అక్రమంగా తరలిస్తున్న రూ.483 కోట్లు విలువైన నగదు, మద్యం తదితరాలను పట్టుకున్నాం. సీ-విజిల్ యాప్ ద్వారా భారీ ఎత్తున ఫిర్యాదులు వచ్చాయి. ఏపీలో ఈస్థాయిలో పోలింగ్ ఎప్పుడూ జరగలేదు. క్లినెస్ట్ లిస్ట్ తయారు చేశాం" అని తెలిపారు.

## ఓటెయ్యడంలో ప్రపంచ రికార్డు

(మొదటి పేజీ తరువాయి..)
మంగళవారం వెలువడనున్న సార్వత్రిక ఎన్నికల ఫలితాల కోసం యావత్ దేశం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది. ఈ సమయంలో కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రత్యేకంగా మీడియా సమావేశం ఏర్పాటుచేసింది. ఎన్నికల ముగింపుపై ఈసీ ఇటువంటి సమావేశాన్ని ఏర్పాటుచేయడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఈసందర్భంగా కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి రాజీవ్‌కుమార్ మాట్లాడుతూ.. దేశంలో చరిత్రాత్మక ఎన్నికలు జరిగాయని రాజీవ్‌కుమార్ అన్నారు. ఓటింగ్‌లో భారత్ వరల్డ్ రికార్డు సృష్టించిందని తెలిపారు. ఓటేసిన ప్రతి ఒక్కరికీ మేం ధన్యవాదాలు చెబుతున్నామని అన్నారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్, మహిళా ఓటర్లకు సెల్యూట్ చేశారు. దేశవ్యాప్తంగా 64.20 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని సీఈసీ రాజీవ్‌కుమార్ తెలిపారు. జీ7 దేశాల్లోని మొత్తం ఓటర్ల కంటే ఈ సంఖ్య 1.5 రెట్లు ఎక్కువ అని పేర్కొన్నారు. ఐరోపా సమాఖ్యలోని 27 దేశాల ఓటర్ల కంటే 2.5 రెట్లు ఎక్కువ అని చెప్పారు. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు పోటెత్తారని తెలిపారు. 31.2 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని చెప్పారు. ఈ ఎన్నికలను 68,763 బృందాలు పర్యవేక్షించాయని.. ఎన్నికల ఏర్పాట్ల కోసం 4 లక్షల వాహనాలను ఉపయోగించామని తెలిపారు. 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో రీపోలింగ్ అవసరం రాలేదని చెప్పారు. గత ఎన్నికల్లో 540 చోట్ల రీపోలింగ్ నిర్వహించగా.. ఈసారి ఆ సంఖ్య 39కి తగ్గిందన్నారు. అందులో కేవలం రెండు రాష్ట్రాల్లోనే 25 చోట్ల పోలింగ్ జరిగిందని తెలిపారు.

గత నాలుగు దశాబ్దాలతో పోలిస్తే జమ్మూకశ్మీర్‌లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని సీఈసీ తెలిపారు. అక్కడ 58.58 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఇక ఎన్నికల్లో నగదు ప్రవాహాన్ని విజయవంతంగా అడ్డుకున్నామని వెల్లడించారు. రూ.10వేల కోట్ల నగదు, కానుకలు, డ్రగ్స్, మద్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయని పేర్కొన్నారు. తాజా ఎన్నికల్లో మొత్తం 64.2 కోట్ల మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జీ7 దేశాల్లోని మొత్తం ఓటర్ల కంటే ఈ సంఖ్య 1.5 రెట్లు ఎక్కువ. ఐరోపా సమాఖ్యలోని 27 దేశాల ఓటర్ల కంటే 2.5 రెట్లు ఎక్కువ కావడం విశేషం. ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్లు పోటెత్తారు. 31.2 కోట్ల మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగిం చుకున్నారు. ఈ నేపథ్యంలో మహిళా ఓటర్లకు స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల పక్రియ ఇదే. 1.5కోట్ల మంది పోలింగ్, సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తించారు. 68,763 బృందాలు ఈ ఎన్నికలను పర్యవేక్షించాయి. 135 ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తెచ్చాం. ఎన్నికల ఏర్పాట్ల కోసం 4లక్షల వాహనాలను ఉపయోగించాం. 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో రీపోలింగ్ అవసరం రాలేదు. గత ఎన్నికల్లో 540 చోట్ల రీపోలింగ్ నిర్వహించగా.. ఈసారి ఆ సంఖ్య 39కు తగ్గింది. ఇందులో కేవలం రెండు రాష్ట్రాల్లోనే 25 చోట్ల రీపోలింగ్ జరిగింది. గత నాలుగు దశాబ్దాలతో పోలిస్తే జమ్మూకశ్మీర్‌లో అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. మొత్తం అక్కడ 58.58శాతం ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కశ్మీర్ లోయలో 51.05శాతం పోలింగ్ నమోదైంది. ఎన్నికల్లో నగదు ప్రవాహాన్ని విజయవంతంగా అడ్డుకున్నాం. రూ.10వేల కోట్ల విలువైన నగదు, కానుకలు, డ్రగ్స్, మద్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు స్వాధీనం చేసుకున్నాయి. 2019లో ఈ సంఖ్య రూ.3,500 కోట్లుగా ఉంది. ఈ ఎన్నికల సమయంలో సీ-విజిల్ యాప్‌లో 4.56 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. వీటిల్లో 99.9శాతం ఫిర్యాదులను పరిష్కరించాం. ఇందులో 87.5శాతం వాటికి 100 నిమిషాల్లోపే పరిష్కారం చూపాం. డీప్‌ఫేక్ వీడియోలను నిలువరించాం. ఇక, జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై ఈసీ స్పందించారు. కౌంటింగ్ పక్రియ చాలా పటిష్ఠంగా జరగనున్నట్లు తెలిపారు.


## 15లోగా కొత్త వీసీలు..

**నేటి ఫోకస్ న్యూస్, హైదరాబాద్, జూన్ 3:**
విశ్వవిద్యాలయాలకు కొత్త ఉపకులపతులను ఈ నెల 15లోగా నియమిస్తామని విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం చెప్పారు. 3 రోజుల్లో సెర్చ్ కమిటీల సమావేశాలను పూర్తిచేసి, కొత్త వీసీల నియామక ప్రక్రియను చేపడతామని వెల్లడించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొత్త వీసీల నియామకంపై ఇప్పటికే కొంత కసరత్తు జరిగిందని.. మూడు రోజుల్లో సెర్చ్ కమిటీ సమావేశాలను పూర్తిచేస్తామని తెలిపారు. అనంతరం ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపిస్తామన్నారు. అలాగే.. విద్యార్థులను పెద్ద ఎత్తున ప్రభుత్వ స్కూళ్లలో చేర్పించడమే లక్ష్యంగా 6 లేదా 7వ తేదీ నుంచి రాష్ట్రంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని వెంకటేశం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరడం వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారాన్ని నిర్వహిస్తామన్నారు. సర్కారు బడుల్లో చదివితే ఫీజుల భారం ఉండదని, పౌష్టిక ఆహారం లభిస్తుందని, ట్రిపుల్ ఐటీ వంటి సంస్థల్లో సీట్లను పొందచ్చని, ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్‌లను పొందవచ్చని ఆయన పేర్కొన్నారు. ఇక.. ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను త్వరలోనే చేపడతామని ఆయన వెల్లడించారు.
ఇప్పటికే రాష్ట్రంలో 1.20 లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారని.. త్వరలోనే డీఎస్సీ ద్వారా మరో 11 వేల మంది కొత్త ఉపాధ్యాయులు వస్తారని, వీరే కాకుండా 2008 డీఎస్సీ ద్వారా మరో మూడు వేల మంది వరకూ అందుబాటులోకి వస్తారని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ స్కూళ్లలో 19 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉండాల్సిన ఉపాధ్యాయ పోస్టుల నిష్పత్తి కంటే మెరుగ్గానే టీచర్లు ఉన్నారని గుర్తు చేశారు. ఉపాధ్యాయులతో పాటు ప్రతి ఉద్యోగికీ హాజరు విధానాన్ని అమలు చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. మంత్రులు, ముఖ్యమంత్రి వంటి వారికి కూడా హాజరు పద్ధతిని ప్రవేశపెట్టేఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు.

**ఫీజుల నియంత్రణపై..**
నార్మలైజేషన్ లేకుండా టెట్ పరీక్షల ఫలితాలను వెల్లడించాలనే ఆలోచన ఉందని వెంకటేశం తెలిపారు. అలాగే... కేంద్రం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యావిధానం(ఎన్ఈపీ)పైన కూడా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోని ఏడు రాష్ట్రాల్లో తెలంగాణ కూడా ఉందని వెల్లడించారు. ఇక.. స్కూళ్లల్లో ఫీజుల నియంత్రణ అంశాన్ని క్యాబినెట్ సబ్ కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే ఒక నివేదికను సబ్‌కమిటీకి అందించామని, దీనిపై కమిటీ చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. క్యాబినెట్ సబ్ కమిటీ ఇచ్చే సూచనల ఆధారంగా ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లును ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు.




## మార్కెట్లకు ఎగ్జిట్ పోల్స్ కిక్..



**నేటి ఫోకస్ న్యూస్, ముంబై:**
భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ముచ్చటగా మూడోసారి భారీ మెజారిటీతో అధికారం చేపట్టనుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాలతో స్టాక్ మార్కెట్ వర్గాల్లో ఉత్సాహం ఉప్పొంగింది. ఇన్వెస్టర్లు కొనుగోళ్ల సునామీ సృష్టించారు. దాంతో ప్రామాణిక ఈక్విటీ సూచీలు మూడేళ్లలో అతిపెద్ద లాభాన్ని నమోదు చేసుకోవడంతో పాటు సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. సోమవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 2,507.47 పాయింట్ల (3.39 శాతం) లాభంతో 76,468.78 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపు స్థాయిని నమోదు చేసింది. ఒక దశలో సూచీ 2,777.58 పాయింట్ల వరకు ఎగబాకి 76,738.89 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డునూ నమోదు చేసింది. నిఫ్టీ విషయానికొస్తే, ఒక దశలో 808 పాయింట్లు ఎగబాకి 23,338.70 వద్ద సరికొత్త ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి సూచీ 733.20 పాయింట్ల (3.25శాతం)లాభంతో 23,263.90 వద్ద స్థిరపడింది. 2021 ఫిబ్రవరి 1తర్వాత సెన్సెక్స్, నిఫ్టీకి ఇదే అతిపెద్ద ఒక్కరోజు లాభం. ఆసక్తికర విషయం ఏమిటంటే, 2019 మే 20న కూడా ఎన్‌డీఏ రెండోసారి అధికారంలోకి రానుందన్న ఎగ్జిట్ పోల్స్ అంచనాతో సూచీలు 3శాతానికి పైగా పుంజుకున్నాయి. మార్కెట్ భారీ ర్యాలీతో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజులోనే రూ.13.78 లక్షల కోట్లకు పైగా పెరిగి సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.425.91 లక్షల కోట్లకు (5.13 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.

# ప్రమాదకరంగా ఉన్న మెయిన్ వాల్స్‌లను తక్షణమే మరమ్మతులు చేయించండి

- "రోనాల్డ్ రోస్" ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్‌ను ఒక్కసారి విజిట్ చేయండి.
- వచ్చేది వానకాలం వాహనదారులకు ఏ ప్రమాదం జరిగినా పూర్తి బాధ్యత జిహెచ్ఎంసి వారిదే
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న జిహెచ్ఎంసి అధికారులు
- టిటిడిపి ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ అధ్యక్షులు మహేందర్

**నేటి ఫోకస్ న్యూస్, ప్రతినిధి మీసాల ఎల్లేష్ ఓల్డ్ బోయిన్ పల్లి, కంటోన్మెంట్ జూన్ 3 :**
ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లోని డ్రైనేజీ మెయిన్ వాల్స్ పాడవడం జరిగిందని, జిహెచ్ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన ఎవరు పట్టించుకోవడంలేదని, టిటిడిపి పార్టీ ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ అధ్యక్షులు మహేందర్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఫోకస్ న్యూస్ రిపోర్టర్ తో మహేందర్ యాదవ్ మాట్లాడుతూ... ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ లోని వివిధ వార్డు, బస్తీలలో డ్రైనేజీ మెయిన్ వాల్స్ పాడవడంతో వాహనదారులకు ప్రతిరోజు ఏదో ఒక సందర్భంలో ప్రమాదానికి గురవుతున్నారని, డ్రైనేజ్ మెయిన్ వాల్స్ ఎంతో ఇబ్బందికరంగా ఉన్నాయని, వాటిలో ముఖ్యంగా చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ జలమయ్యే ప్రాంతం రాంరెడ్డి కాలనీ, సీతారాంపురం, ఓల్డ్ కళ్యాణి మూవీ మాక్స్, శ్రీ చైతన్య పాఠశాల ప్రధాన రోడ్డు దగ్గర, డ్రైనేజీ మెయిన్ వాల్ ఎంతో ప్రమాదకరంగా ఉన్నాయని, చిన్నపాటి వర్షం వస్తే రోడ్లన్నీ జలమయమయ్యే, ఇలాంటి ప్రమాదకరమైన డ్రైనేజీల వలన ఎంతోమంది వాహనదారులకు ప్రమాదలు జరుగుతుందని, అలాంటి మెయిన్ వాల్స్ లను తక్షణమే మరమ్మతులు చేయించాలని, జిహెచ్ఎంసి అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన కూడా, ఎవరు పట్టించుకోవడంలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చేది వర్షాకాలం వాహనదారులకు ఎవరికి ఎలాంటి ఇబ్బందులు కలిగిన దానికి పూర్తి బాధ్యత జిహెచ్ఎంసి అధికారులే వహించవలసి ఉంటుందని, మహేందర్ యాదవ్ జిహెచ్ఎంసి కమిషనర్ రోనాల్డ్ రోస్ గారికి విజ్ఞప్తి చేశారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకముందే జిహెచ్ఎంసి అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని ప్రమాదకరమైన డ్రైనేజ్ మెయిన్ వాల్స్ లను తక్షణమే ఏర్పాటు చేసే విధంగా చూడాలని అధికారులను కోరారు. స్థానికంగా ఉండే రాజకీయ నాయకులు కూడా ప్రత్యేక చొరవ తీసుకొని వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.





నేటి ఫోకస్ న్యూస్






# ప్రమోషన్స్ పెంచిన కల్కి టీమ్

## క్లీంకారకు బుజ్జి బొమ్మ గిఫ్ట్..

కల్కి' టీమ్ ప్రమోషన్స్ జోరు పెంచింది. అందులో భాగంగానే సినీ సెలబ్రిటీల పిల్లలకు గిఫ్టులు పంపుతోంది. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందిన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'కల్కి 2898 ఏడీ' ఈ చిత్రం జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఇటీవల బుజ్జి వెహికల్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించిన టీమ్.. దీంతోనే ప్రమోషన్స్‌ను షురూ చేసింది. సినీ సెలబ్రిటీల పిల్లలకు 'కల్కి' టీమ్ గిఫ్టులు అందుతున్నాయి. తాజాగా రామ్ చరణ్ కుమార్తె క్లీంకారకు మూవీ యూనిట్ ఓ బహుమతి అందించింది. అందులో బుజ్జి - భైరవ స్టికర్స్, బుజ్జి బొమ్మ, టీషర్ట్స్ ఉన్నాయి. క్లీంకార వాటితో ఆడుకుంటున్న ఫొటోలను ఉపాసన ఇన్‌స్టాలో షేర్ చేశారు. కల్కి టీమ్‌కు థ్యాంక్స్, 'ఆల్ ది బెస్ట్' చెప్పారు. అలాగే మరికొంతమంది సెలబ్రిటీల పిల్లలకు కూడా వీటిని పంపనున్నట్లు తెలుస్తోంది. ప్రచారంలో భాగంగానే తాజాగా 'బుజ్జి అండ్ భైరవ' పేరుతో యానిమేటెడ్ సిరీస్ తీసుకొచ్చింది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా స్ట్రీమింగ్ అవుతున్న ఈ సిరీస్‌కు మంచి ప్రేక్షకాదరణ వచ్చింది. ప్రభాస్ సరసన దీపిక పదుకొణె నటిస్తుండగా.. సీనియర్ హీరో కమల్ హాసన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. అలాగే అమితాబ్ బచ్చన్, పశుపతి, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# సూర్య సినిమాలో పూజా హెగ్డే

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య ప్రస్తుతం వరుస సినిమాలతో ఎంతో బిజీగా వున్నారు. ప్రస్తుతం సూర్య నటిస్తున్న లేటెస్ట్ 'కంగువ'.కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ శివ తెరకెక్కిస్తున్న ఈ సినిమాను స్టూడియో గ్రీన్ అండ్ యూవీ క్రియేషన్స్ బ్యానర్స్ పై జ్ఞానవేల్ రాజా , వంశికృష్ణ రెడ్డి ప్రమోద్ ఉప్పలపాటి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.. భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో సూర్య సరసన బాలీవుడ్ బ్యూటీ దిశా పటాని హీరోయిన్‌గా నటిస్తుంది. అలాగే యానిమల్ మూవీ ఫేమ్ బాబీ డియోల్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు. ఇదిలా ఉంటే సూర్య నటిస్తున్న మరో మూవీ ' సూర్య 44 '..ఈ సినిమాను కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ జిగర్ తండా డబల్ ఎక్స్ ఫేమ్ కార్తీక్ సుబ్బరాజు తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించనున్నారు. సినిమాలో పాపులర్ మలయాళ నటుడు జోజు జార్జ్ కీలక పాత్రలో నటిస్తున్నాడు.తాజాగా ఈ సినిమా కు సంబంధించి మేకర్స్ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు.ఈ సినిమాలో స్టార్ హీరోయిన్ పూజ హెగ్డే హీరోయిన్ గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.తాజాగా పూజ హెగ్డేకు వెల్కమ్ చెబుతూ మేకర్స్ స్పెషల్ పోస్టర్ ను రిలీజ్ చేసారు.ఈ పోస్టర్ బాగా వైరల్ అవుతుంది. ఇదిలా ఉంటే ఈ సినిమా షూటింగ్ జూన్ నుండి ప్రారంభం కానున్నట్లు సమాచారం.




# హీరామండి

## సెకండ్ సీజన్ ప్రకటన

సంజయ్‌లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కిన 'హీరామండి: ది డైమండ్ బజార్' ఇటీవల విడుదలై సంచలనం సృష్టించింది. భారీ తారాగణంతో పీరియాడిక్ డ్రామాగా రూపొందిన ఈ వెబ్ సిరీస్ బాలీవుడ్ ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. తన సినిమాల్లాగే దీన్ని కూడా సంజయ్ చాలా గ్రాండ్‌గా తెరకెక్కించారు. ఇప్పుడీ సిరీస్‌కు సీజన్ 2ను ప్రకటించి అందరికీ సర్‌ప్రైజ్ ఇచ్చారు. మొదటి పార్ట్‌కు కొనసాగింపుగా ఏం చూపనున్నారో వివరించారు. సీజన్2 గురించి సంజయ్‌లీలా భన్సాలీ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఈ సిరీస్ కోసం నేను 2022లో 'గంగూబాయి కాఠియావాడి' పూర్తయినప్పటి నుంచి కష్టపడ్డాను. నా తొలి సిరీస్ కావడంతో మరింత కష్టంగా అనిపించింది. బాధ్యతగా భావించి దీని పనులు మొదలుపెట్టినప్పటినుంచి బ్రేక్ లేకుండా పని చేశాను. 'హీరామండి-2'లో వేశ్యలందరూ లాహోర్ వదిలి సినీ పరిశ్రమకు వస్తారు. దేశ విభజన సమయంలో వారందరూ ముంబయి, కోల్‌కతా వెళ్లి స్థిరపడతారు. అక్కడినుంచి ఇండస్ట్రీలోకి ఎలా వచ్చారన్నది చూపనున్నా. సీజన్2లోనూ వాళ్లందరూ డ్యాన్స్ చేస్తారు. అయితే మొదటి పార్ట్‌లో నవాబుల కోసం డ్యాన్స్ చేసినవారు.. రెండో సీజన్‌లో చిత్ర నిర్మాతల కోసం చేస్తారు. ఈ కథతో ముందుకువెళ్లనున్నా. ఎప్పుడవుతుందో చూడాలి' అని తెలిపారు. ఇక సీజన్ 2 ప్రకటించడంలోనూ సంజయ్ తన మార్క్ చూపారు. 100 మంది అమ్మాయిలు అనార్కలీ డ్రెస్‌లో డ్యాన్స్ వేస్తూ.. సీజన్2 ఉన్నట్లు ఆ మూమెంట్స్‌తో తెలిపారు. ఈ వీడియోను నెట్‌ఫ్లిక్స్ షేర్ చేయగా అది అందరినీ ఆకట్టుకుంటోంది. మొదటి భాగానికి మంచి ప్రేక్షకాదరణ వచ్చిందని అందుకే రెండో దాన్ని తెరకెక్కించనున్నట్లు నెట్‌ఫ్లిక్స్ తెలిపింది. తొలిభాగంలో మనీషా కొయిరాలా, సోనాక్షి సిన్హా, అదితిరావు హైదరీ, రిచా చద్దా, సంజీదా షేక్, షర్మిన్ సెగల్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. రూ.200కోట్లతో రూపొందిన ఫస్ట్‌పార్ట్‌లోని కొన్ని సన్నివేశాలు ఇన్‌స్టాలో ట్రెండ్ సృష్టించాయి.